

ఆర్టీసీ కరీంనగర్-2 డిపో ప్రైవేట్ పరం

- ఇక నుంచి ఎలక్ట్రిక్ బస్సుల ప్రయాణం
- ఆగస్టు 15 తర్వాత ప్రారంభం
- ఇప్పటికే చేరుకున్న 35 బస్సులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) కరీంనగర్-2 డిపోను ప్రైవేట్ పరం చేస్తోంది. మెజర్స్ జేబీఎం అనే సంస్థకు ఈ డిపో నుంచి బస్సులను నడిపించేం దుకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నది. ఈ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇప్ప టికే 35 ఎలక్ట్రిక్ బస్సులు టూ డిపోకు చేరుకున్నాయి. ఆగస్టు 15 తర్వాత ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించే అవకాశం ఉన్నది. టూ డిపో నుంచి ప్రస్తుతం ఆర్టీసీ 53 సొంత బస్సులు, 52 అద్దె బస్సులను ఆపరేట్ చేస్తున్నది.

కండక్టర్లు మినహా ఇతర సిబ్బందికి స్థాన చలనం

360 మంది ఉద్యోగులు ఈ డిపోలో పనిచేస్తు న్నారు. ప్రస్తుతం ఈ డిపో ను ప్రైవేట్ పరం చేస్తుం డడంతో ఈ బస్సు లను, కండక్టర్లు మినహా ఇతర ఉద్యోగులను, ఇతర డిపోలకు పంపించి సర్దుబాటు చేస్తు న్నారు. కండక్టర్లను డిపోను అద్దెకు తీసుకున్న జేబీ ఎం సంస్థలోనే పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ కరీంన గర్-2 డిపోతో పాటు నిజామాబాద్, వరంగల్, నల్లొండ, సూర్యాపేట, హైదరాబాద్ టూ డిపో లను ప్రైవేట్ మేనేజ మెంట్‌కు అద్దెకు ఇచ్చి ఎలక్ట్రిక్ బస్సులను నడ పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో కరీంనగర్‌కు 35, నిజామాబాద్‌కు 13 ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పరం చేస్తున్న ఆరు డిపోలనుంచి 500 ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని నిర్ణయిం చారు. వీటిలో టైప్-3 ఎలక్ట్రిక్ బస్సులతోపాటు నాన్ ఏసీ ఇంటర్ సిటీ బస్సులు కూడా ఉంటాయి. కరీంన గర్-2 డిపోలో ఇప్పటికే బస్సు లు, ఇతర ఉద్యోగుల సర్దు బాటు ప్రారంభమైంది. ఈ డిపోకు 80 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. డిపోకు ఇప్పటికే 11కేవీ విద్యుత్ లైన్లను వేశారు. 14 చార్జింగ్ పాయింట్లకుగాను 12 పాయింట్లను ఇప్పటికే నిర్మించారు. మూడు ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా రెండు ట్రాన్స్‌ఫార్మర్ల పనులు పూర్తయ్యాయి. త్వరలో మరో రెండు చార్జింగ్ పాయింట్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 10నే ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించాలనుకున్నా 15వ తేదీ తర్వాత ప్రారంభించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించిందని సమాచారం. రాష్ట్రంలోనే తొలి ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన డిపోగా కరీంనగర్-2 డిపో నిలువనున్నది.



కరీంనగర్‌కు చేరుకున్న ఎలక్ట్రిక్ బస్సు



కరీంనగర్ 2 డిపోలో ఏర్పాటు చేసిన చార్జింగ్ పాయింట్లు



మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సందడి

ఆలయాల్లో శ్రావణ సందడి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10: శ్రావణమాసంలో తొలి శనివారం సందర్భంగా నగరంలోని వేంకటేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్త జన సందడి నెలకొంది. మార్కెట్‌రోడ్, మంకమ్మతోట, విద్యానగర్, కట్టరాంపూర్, జ్యోతీనగర్ వేంకటేశ్వరాలయాలతో పాటు పలు ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు బారుల తీరి దర్శనాలు చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆయా ఆలయాల అధికారులు, సిబ్బంది, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి..

- యువ రైతులు ఆర్థికంగా ఎదగాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, ఆగస్టు 10: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను యువ రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సైదాపూర్ మండలంలోని సైదాపూర్, దుద్దెనపల్లి రైతు వేదికలలో వ్యవసాయ, అనుబంధ రంగాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మా ట్లాడుతూ యువకులు తమ మేధా శక్తితో లాభాలు వచ్చే పంటలను సాగు చేసి అభి వృద్ధి చేందాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 1.5 లక్షల రుణమాఫీ చేసిందని, త్వరలోనే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తుందన్నారు. ఎవరికైనా సాంకేతిక సమ స్యల వల్ల రుణమాఫీ రాకపోతే వ్యవ సాయాధికారులకు వివరాలు సమర్పించా లన్నారు. అర్హత ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. హుస్నాబాద్ నియోజక వర్గానికి గుండెకాయలాంటి గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. సైదాపూర్, చిగురుమామిడి మండలాలకు తోటపల్లి ద్వారా, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు దేవాదుల ద్వారా నీళ్లు అందిస్తామని తెలిపారు. అనంతరం రైతు వేదిక ఆవరణలో మం త్రి మొక్కలు నాటారు.



సైదాపూర్‌లో నాటు వేస్తున్న కూలీలతో ముచ్చటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



దుద్దెనపల్లి రైతు వేదికలో మొక్కలు నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నాటు వేస్తున్న కూలీలతో ముచ్చట

మంత్రి పొన్నం ప్రభాకర్ సైదా పూర్‌కు వస్తున్న క్రమంలో మార్గ మధ్యలో సైదాపూర్ సమ్మక్క గుట్ట సమీపంలో నాటు వేస్తున్న కూలీ లను చూసి కారు ఆపి వారితో కాసేపు ముచ్చటించారు. కార్యక్ర మంలో హుజూరాబాద్ ఆర్డీవో రమే ష్, వెన్కేపల్లి, వెన్నంపల్లి సింగిల్ విండో చైర్మన్‌లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకటరెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, మండల వ్యవసాయాధికారి వైదేహి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10: నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. కమిషనరేట్ పరిధిలో నార్కోటిక్ సెల్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్కోటిక్ జాగిలం(లియో)తో జిల్లా కేంద్రంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. కమిషనరేట్‌లో నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడానికి కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు శనివారం బస్టాండ్, పార్సిల్ కార్యాలయం, కిరాణ షాపులు, పాన్ షాప్‌లు, హాస్టల్స్, అనుమానిత ఇళ్లలో టౌన్ ఏసీపీ నరేందర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో టౌన్ సీఐ సరిలాల్, సిబ్బంది, నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలం, డాక్టర్ హ్యాండ్లర్ కానిస్టేబుల్ ఎ శంకర్‌తో కలిసి అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారన్నారు. ఎవరైనా వ్యక్తుల వద్ద ప్రభుత్వం నిషేదించిన గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఉన్నా లేక విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు బాధ్యతగా వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు తెలియజేయా లన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.



పోలీస్ జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

దిగ్గజ కంపెనీలతో

రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల ఒప్పందాలు

- డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



కరీంనగర్ అర్బన్/మానకొండూర్, ఆగస్టు 10: ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పెట్టుబడులే లక్ష్యంగా జరుపుతున్న అమెరికా పర్యటనలో దిగ్గజ కంపెనీలతో భారీ పెట్టుబడులతో ఒప్పందాలు కుదుర్చుకుంటు న్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు అధికారులతో ముఖ్యమంత్రి అమెరికా పర్యటనలో నేపథ్యంలో కాగ్నిజెంట్, ఆర్సీఎం, స్వచ్ఛ్ బయో, ట్రైజిన్ టెక్నాలజీస్, హెచ్‌సీఏ హెల్త్ కేర్ కార్నింగ్, వరల్డ్ బ్యాంక్, వివింట్ ఫార్మా, ఆమ్‌జెన్, చార్లెస్ స్క్వాబ్ వంటి దిగ్గజ కంపెనీలు ఒప్పందాలు కుదుర్చు కునేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. కొంత మంది పారిశ్రామిక వేత్తల సహకారంతో వాల్ష్ కర్రా హోల్డింగ్స్ కంపెనీ యాజమాన్యం తెలంగాణలో 100 మిలియన్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నదని తెలి పారు. ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరుపొందిన జోయిటిస్ కంపెనీ హైదరాబాద్‌ఓల తమ కేపబులిటీ సెంటర్‌ను విస్తరించేందుకు ముందుకు రావడం అభినందనీమన్నారు. సెప్టెంబరు నుంచి హైదరా బాద్‌లో సంస్థ కార్యకలాపాలు ప్రారంభించనున్నదని, ఈ సంస్థ స్థాపనతో వందలాది మంది తెలంగాణ యువతీ యువకులకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. తెలం గాణలో కొత్త ఆవిష్కరణలకు , వ్యాపార వృద్ధికి అపార మైన అవకాశాలున్నాయని, హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే రేవంత్ రెడ్డి ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతా యన్నారు. బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డిపై చేస్తున్న వాఖ్యలు అర్థరహితమైనవన్నారు. ఓడిపోయిన నైరాశ్యం, ఓర్వలేనితనంతోనే సీఎం అమెరికా పర్యటనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

చెక్ డ్యాంలకు జల కళ



నీటితో నిండిన దుర్శేడ్ చెక్ డ్యామ్ నుంచి బయటకు వస్తున్న నీరు

కరీంనగర్ రూరల్, ఆగస్టు10: ఇటీవల కురుస్తున్న వర్షాలతో కరీంనగర్ మండలంలోని పలు చెరువులు కుంటలు జల కళ సంతరించుకున్నాయి. వాటితో పాటు ఆయా గ్రామాలను కలుపుతూ నిర్మించిన చెక్ డ్యాంలోకి నీరు వచ్చి చేరడంతో నిండుకుండల్లా మారాయి. దీంతో చెక్ డ్యామ్ పరిధిలోని పలు గ్రామాల రై తుల పొలాల్లోని బావుల్లో నీ రు చేరింది. చెక్ డ్యామ్‌లు మత్తడి దుకడంతో రైతులు సంతో షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 1,221 మంది లబ్ధిదారులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 1,221 మంది లబ్ధిదారులకు 3,43,12,448 రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో మందికి ఆర్థికంగా చేదోడుగా నిలిచిందని అన్నారు. అర్హులైన వారందరికీ సీఎంఆర్‌ఎఫ్‌తోపాటు సంక్షేమ పథకాలు అందిస్తామని కమలాకర్ తెలిపారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, కార్పొరేటర్లు గందె మాధవిమహేశ్, బండారి వేణు, నాంపల్లి శ్రీనివాస్, జంగిలి ఐలేందర్‌యాదవ్, కచ్చు రవి, ఏదుళ్ల రాజశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు ఏవీ రమణ, గందె మహేశ్, సుధగోని కృష్ణగౌడ్, సంపత్‌రావు, దుడ్డెల ప్రశాంత్ పాల్గొన్నారు.



లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

వీధికుక్కల సమస్యలపై 'బల్దియా' సీరియస్

- జంతు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్
- 86 వీధికుక్కల పట్టివేత
- 59 కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్



కరీంనగర్ టౌన్, ఆగస్టు 10: వీధికుక్కల దాడుల వరుస సంఘటనలను నగరపాలక సంస్థ, అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కొన్ని రోజులుగా ప్రతిరోజూ జిల్లాలో, నగరంలో ఏదో ఒక చోట వీధి కుక్కలు పిల్లలు, పెద్దలు, మహిళలపై దాడుల చేసి తీవ్రంగా గాయపరుచడంతో ప్రజలు తీవ్రభ యాందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 10వేలకు పైగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ఎక్కడో ఒక చోట చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. గత వారంలో రాంపూర్‌లో వీధికుక్క దాడిలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందగా, రెండు రోజుల క్రితం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ప్రధాన రహదా రిపై అందరూ చూస్తుండగానే ఓ వీధికుక్క రెండేళ్లలోపు బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. ఈనెల 4న 'అయ్య భౌబోయ్' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వీధికుక్కల దాడులపై కథనం ప్రచురితమైంది. ఓవైపు వరుస దాడులు మరోవైపు మీడియాలో వస్తున్న కథనాలకు నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. మొన్నటి వరకు సెలవుపై వెళ్లిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ విధుల్లో చేరిన వెంటనే రెండవ శనివారం సెలవు రోజు అయినప్పటికీ వీధికుక్కల దాడులను తీవ్రంగా పరిగణించారు. శనివారం ఆయన నగరంలోని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని జంతు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి, వీధికుక్కలకు చేస్తున్న బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు, అంతుకుముందు వాటికి ఇస్తున్న వ్యాక్సినేషన్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరంలో వీధికుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతున్నందున ఎక్కువ సంఖ్యలో వీధికుక్కలను తీసుకువచ్చి వాటికి బర్త్‌కంట్రోల్ ఆపరేషన్లు చేసి ఐదురోజుల సంరక్షణ అనంతరం ఎక్కడి నుంచి తీసుకువచ్చారో తిరిగి అదే ప్రాంతంలో విడిచి పెట్టాలని ఆదేశించారు. ఈ నెలలో ఇప్పటి వరకు 86 వీధికుక్కలను తీసుకువచ్చామని, వీటిలో 59 కుక్కలకు ఆపరేషన్ చేశామని, 27 కుక్కలకు ఆపరేషన్ చేయాల్సి ఉందని సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ఉన్న జంతు సంరక్షణ కేంద్రంలోం 24 కుక్కల బోన్లు మాత్రమే ఉన్నాయని, స్థలాభావం ఉన్నందున ఒక్కో బోనులో రెండు కుక్కలను ఉంచి వాటికి పేయిన్ కిల్లర్, యాంటీ రేబిస్ ఇంజక్షన్లను ఇచ్చి వదిలిపెడుతున్నామని కాంట్రాక్టర్, అధికారులు చెప్పారు. ఒక్కో కుక్కకు ఆపరేషన్ చేసేందుకు 1,650 రూపాయిలు చెల్లిస్తున్నామని అధికారులు వివరించారు. నగరంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున అదనంగా మరో 30 తాత్కాలికంగా కుక్క బోన్లను ఏర్పాటు చేసి ఆపరేషన్లను వీలైనంత ఎక్కువగా చేసి కుక్కల బెడద నివారించాలని ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశించారు. ప్రజలు వీధికుక్కలపై అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గట్టు శ్రీనివాస్, వర్క్ఇన్‌స్పెక్టర్, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.



జంతు సంరక్షణ కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



అత్తింటి వారి దాష్టీకం

- భర్త సంవత్సరీకానికి ఇంటికి వచ్చిన మహిళ
- తాళం వేసుకొని వెళ్లిపోయిన అత్తామామలు

హుజూరాబాద్, ఆగస్టు 10: అనారోగ్యంతో భర్త చనిపోగా పిల్లలతో కాలం వెళ్లదీస్తున్న క్రమంలో అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారు. శనివారం భర్త సంవత్సరీకం పెట్టేందుకు ఇంటికి రాగా అత్తామామలు తాళం వేసుకొని వెళ్లిపోయారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన శ్రావణ్‌కు ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామానికి చెందిన రవళితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. గత ఏడాది ఆగస్టు నెలలో శ్రావణ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. ఇల్లును ఖాళీ చేసి వేరే చోట ఉండాలని చెప్పడంతో రవళి వేరే చోట నివాసం ఉంటుంది. భర్త సంవత్సరీకం చెద్దామని శనివారం ఇంటికి రాగా అత్తామామలు ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. చేసేది ఏం లేక ఇంటి ఎదుట భర్త ఫొటో పెట్టుకుని రవళి తన పిల్లలతో కలిసి సంవత్సరీకం నిర్వహించింది. చుట్టు పక్కల వారు ఈ పరిస్థితిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తమ అత్తామామలు వేధింపులకు గురి చేస్తున్నారని, తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని రవళి వేడుకుంది.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు టి సాగర్


నినాదాలు చేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 10: రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న నిరుపేదలకు పట్టాలిచ్చి సౌకర్యాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి సాగర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పవర్‌హౌస్ కాలనీలోని ప్రైవేట్ గార్డెన్స్‌లో సీపీఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ తెలంగాణ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మహేశ్వరి పార్టీ జెండా ఆవిష్కరించగా జిల్లా కార్యదర్శి యాకయ్య తరగతులను ప్రారంభించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని నివాసముంటుంటే సరైన రోడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఇళ్లు కేటాయింపునకు బడ్జెట్‌లో నిధులేమి లేవన్నారు. నిరుపేదలకు కేంద్రప్రభుత్వం 10లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి 5 లక్షల రూపాయలు ఇవ్వడమేకాకుండా పట్టాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తరగతులకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లిల్లల బాలకృష్ణ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో వేల్పుల కుమార స్వామి, ఎం రామాచారి, భాగ్య, అనూష, సృజన, భవాని, మహేశ్వరి, జమున, వాణి, శివ కుమార్, సతీష్, బాలకృష్ణ, క్రాంతి, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల నుంచి గుడిసె వాసులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 10: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మొదటి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయాల్లో ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గురుకుల విద్యార్థి అనిరుధ్ అంత్యక్రియలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం అస్వస్థతకు గురై మృతి చెందిన విద్యార్థి ఎడమల్ల అనిరుధ్ అంత్యక్రియలను బాలుడి అమ్మమ్మ ఊరు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో శనివారం నిర్వహించారు. మృతుడి తండ్రి కృష్ణారెడ్డి గల్ఫ్ నుంచి చేరుకోవడంతో అంతిమ సంస్కారాలు జరిపించారు. కన్న కొడుకు చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అనిరుధ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

విద్యార్థి అనిరుధ్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విద్యార్థి అనురుధ్ మృతదేహం వద్ద శనివారం నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల నారాయణపూర్‌లో గుండెపోటుతో మృతి చెందిన లింగాల సురేశ్ కుటుంబ సభ్యులతోపాటు మండల కేంద్రంలో కుక్కల దాడిలో గాయ పడిన చిన్నారులను కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, రాంరెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాజు, శ్రీనివాస్, రాములు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


రమేష్ మృతదేహం

సైదాపూర్, ఆగస్టు 10: మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన కొలకాని రాజు (32) అనారోగ్యంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం దెబ్బతిని కడుపునొప్పి వచ్చేది. శుక్రవారం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డు పైపునకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. రాజు భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్ట్



నేరాలకు పాల్పడిన నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ, చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు

మెట్‌పల్లి , ఆగస్టు 10 (ఇబ్రహీంపట్నం): రద్దీగా ఉన్న ప్రాంతంలో బైకులు పార్క్ చేసి హ్యాండిల్ లాక్ వేయకుండా ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను మెట్‌పల్లి పోలీసులు పట్టుకుని కటకటాలకు పంపారు. జగిత్యాల జిల్లా పరి ధిలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల టౌన్, గొల్లపల్లితో పాటు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, కమ్మర్‌పల్లి, పోలీస్ స్టేషన్ పరిధిలో కొంత కాలంగా హ్యాండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను, దొంగ సొత్తును కొన్న మరో ఇద్దరు నిందితులను శనివారం మెట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను ఎస్పీ పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం గుమ్మిర్యాల గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. ప్రమాదవశాత్తు కాలు విర గడంలో డ్రైవర్ వృత్తి మానేసి మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. సు లువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో హ్యాండిల్ లాక్ వేయని బైక్‌లను లక్ష్యం చేసుకుని రద్దీగా ఉండే మార్కెట్ ఏరియా, ఆసుపత్రులు, వివిధ షాపుల ముందు నిలిపిన బైక్‌లను దొంగతనం చేయడం ప్రారంభించాడు. ఇందుకు ముందుగా వివిధ రకాల మోటార్ సైకిళ్ల తాళం చెవిలని సేకరించి వాటి సహాయంతో ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవాడు. గత సంవత్సరం నుంచి జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో మొత్తం 6 లక్షల విలువ గల 20 ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. జగిత్యాల జిల్లాలో 13 బైక్‌లు, నిజామాబాద్ జిల్లాలో 7 బైక్‌లు అపహరించారు. చోరీ చేసిన బైక్‌లను నిర్మల్ జిల్లా మామడ మండలం పొం కల్ గ్రామానికి చెందిన మోహమ్మద్ మోసిన్ (ఏ2) చికెన్ షాపు నిర్వహకుడికి, అబ్దుల్ రషీద్‌కు(ఏ3) బైక్ మెకానిక్ షాపు నిర్వాహకుడు ఇద్దరికి చెరో 10 ద్విచక్ర వాహనాలను ఒక్కో బైక్‌ను 8 వేల నుంచి 10 వేల రూపాయల చొప్పున అమ్మి వచ్చిన డబ్బులని జ ల్సాలకు ఖర్చు చేసేవాడు. దొంగ సొత్తు అని తెలిసి కూడ మోహమ్మద్ మోసిన్ అబ్దుల్ రషీద్ లక్ష్మణ్ వద్ద తక్కువ ధరకు కొని ప్రజలకు ఎక్కువ ధరలకు అమ్మి సోమ్ము చేసుకునే వారు.

కొంత కాలంగా ద్విచక్ర వాహనాల చోరీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగిస్తూ బృందాలుగా ఏర్పడి పట్టణ శివారులోని వెంకట్రావ్‌పేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న లక్ష్మణ్‌ని పట్టుకుని విచారించగా ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసినట్లు అంగీ కరించడంతో అతనితో పాటు మిగతా నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నింది తులను పట్టుకోవడంలో చకచాక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ. 27000 నగదు ద్విచక్రవాహనం స్వాధీనం

కోరుట్ల: దొంగతనాలకు పాల్పడుతున్న ఒక మైనర్‌తో పాటు మరో వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ కిరణ్ కుమార్‌తో కలిసి సీఐ అరెస్టు వివ రాలను వెల్లడించారు. పట్టణంలోని కావేరి గార్డెన్ వద్ద ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక యువకుడు, మరో బాలుడు అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన హర్షద్ అతని అల్లుడిగా గుర్తించారు. హర్షద్ అతని అల్లుడితో కలిసి చోరీలకు అలవాటు పడ్డారు. ఈ నెల 5వ తేదీన కోరుట్ల పట్టణంలో ఇద్దరు కలిసి ఓ ద్విచక్ర వాహనం, 7వ తేదీన ఐబీ రోడ్డులోని ఓ కిరాణం దుకాణంలో షెటర్ తాళం పగులగొట్టి దుకాణంలోని రూ 27,000 ఎత్తుకెళ్లారు. కోరుట్ల పట్టణంతో పాటు జగిత్యాల జిల్లా పరిధిలోని వివిధ చోరి కేసుల్లో వీరు నిదితులుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద ఉన్న 27,000 నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాక్యచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ, కానిస్టేబుల్స్ ఎల్లయ్య, సత్తయ్య, సాగర్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్ బాబు

బాలుడిపై వీధి కుక్క దాడి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలో బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడు నిహాన్స్‌ను వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. దీంతో బాలుడు అరవడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు గమనించి కుక్కను తరిమి గాయపడ్డ నిహాన్స్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామాల్లో వీధి కుక్కలతో చిన్నపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, ఆగస్టు 10: విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మానకొండూర్ సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎంగా కార్తీక్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన చేయాల్సిన పనులను మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి బుచ్చయ్యతో చేయిస్తుంటాడు. మానకొండూర్ శివారు గ్రామమైన బంజేరుపల్లిలో రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేస్తుండగా బుచ్చయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ బుచ్చయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ఆపదలో ఉన్న వృద్ధుడికి అండ

అనాథాశ్రమంలో చేర్పించిన సీఐ సరిలాల్


లింగయ్యను ఆశ్రమానికి అప్పగిస్తున్న సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10: ఇద్దరు కూతుర్లు ఉన్నా ఎవరూ అతని పోషణ పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియక ఓ వృద్ధుడు కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకుని అక్కడే గడుపుతుండగా శనివారం కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ చేరదీసి కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు. సీఐ సరిలాల్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన ఇల్లందుల లింగయ్య దిక్కుతోచని స్థితిలో కరీంనగర్ బస్టాండ్‌లో తిరుగుతూ సీఐ సరిలాల్‌కు కనిపించాడు. లింగయ్య వివరాలు సేకరించగా తనకు ఇద్దరు కూతుర్లు ఉన్నారని, ఎవరూ తన ఆలనాపాలనా చూడకపోవడంతో మనస్థాపంతోనే బస్టాండ్‌కు చేరుకున్నానని వృద్ధుడు లింగయ్య తన బాధను సీఐతో వెల్లగక్కాడు. వెంటనే సీఐ సరిలాల్ కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని వీడీ ఫౌండేషన్ వీరబ్రహ్మేంద్ర అనాథవృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు వీరమాధవ్‌కు సమాచారం అందించాడు. వీరమాధవ్‌ను ఠాణాకు పిలిపించుకుని వృద్ధుడు లింగయ్య బాగోగులు చూసుకోవాలని అతన్ని అప్పగించారు. వీరమాధవ్‌ను సీఐతో పాటు స్థానికులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


రమేష్ మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 10: పట్టణానికి చెందిన మురుకుట్ల రమేష్ (49) అనే లారీ డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ ఫైనాన్స్‌లో 5 లక్షల లోన్ తీసుకొని లారీని కొన్నాడు. ఆ తరువాత 12 లక్షల లోన్ తీసుకుని మరో లారీ కొన్నాడు. వర్షాల కారణంగా రెండు నెలలపాటు లారీ నడవకపోవడంతో ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించలేదు. ఫైనాన్స్ కంపెనీకి చెందిన వ్యక్తులు ఇటీవల రమేశ్ ఇంటికి వచ్చి గొడవ చేశారు. మనస్తాపం చెందిన రమేష్ ఈ నెల 8న పురుగుల మందు తాగగా కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. రమేష్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రమేష్ భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. రమేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ ఛైర్మెన్ కొత్తూరి మహేశ్, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి ఐదు వేల నగదును రమేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

శ్రీపాద నుంచి తగ్గిన ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.846 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.18 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి సర్జిపూల్‌కు వచ్చిన నీటిని రెండు పంపుల ద్వారా ప్రతిరోజు 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు ప్రతిరోజు 6,600 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3,700 క్యూసెక్కులు ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్ట్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు తగ్గిన నీటి విడుదల

జగిత్యాల: వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను శనివారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 500 క్యూసెక్కులు తగ్గింపుతో 2,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 3,333 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు


శేషవాహనంపై స్వామివారు

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శనివారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. శ్రావణ సప్తాహ ఉత్సవాలు శనివారం కూడా కొనసాగాయి. అంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన రత్నమాల అనే భక్తురాలు దైవదర్శనానికి వచ్చి చేతిబ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డు రమేష్‌లు బ్యాగు వెతికి భక్తురాలికి అప్పగించారు.

బీసీ కమిషన్ సభ్యుడి పూజలు

బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రత్ పటేల్ శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కటుంబ సమేతంగా వచ్చిన వారికి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు శాలువాలతో సత్కరించారు.

పల్లె నుంచి ఢిల్లీకి..

స్వాతంత్ర్య వేడుకలకు విద్యార్థినికి ఆహ్వానం


శ్రీచందన

రాయికల్, ఆగస్టు 10: రాయికల్ మండలంలోని రామారావుపల్లె గ్రామానికి చెందిన విద్యార్థిని పంబాల శ్రీచందను ఈ నెల 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కావాలని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన దేశ భక్తుల వేషధారణ పోటీలో శ్రీచందన సుభాష్ చంద్రబోస్ వేషం ధరించి పోటీలో పాల్గొనగా దేశవ్యాప్తంగా 250 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనవారితో పాటు వారి సహాయకులకు స్వాతంత్ర్య వేడుకలు వీక్షించేందుకు ఆహ్వానం అందిందని గైడ్ టీచర్ కడకుంట్ల అభయ్‌రాజ్ తెలిపారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 10: ఈనెల 31, సెప్టెంబరు 1, 2తేదీలలో హైదరాబాద్‌లో జరుగనున్న పీవోడబ్ల్యూ 7వ రాష్ట్ర మహాసభలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె జ్యోతి పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మహాసభల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఇతర సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో కార్యచరణను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిందితులపై కఠినచట్టాలు అమలు చేయలేకపోయారన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా కఠినంగా వ్యవహరించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధ్యులను శిక్షించి మహిళలను రక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రజిత, బుచ్చమ్మ, మంగ, అమృత, స్వప్న, సరోజన, కవిత, పద్మ, శారదా, సత్యమ్మ, పద్మ, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 : జగిత్యాల పట్టణంలోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలులో బొగ్గువ్యాగన్‌లో మంటలు చూసి స్టేషన్‌మాస్టర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన జగిత్యాల అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈసంఘటనలో సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి ఎ. కృష్ణకాంత్ తెలిపారు. మంటలు ఎలా వ్యాపించాయి అనేది అధికారులు విచారణ చేస్తున్నారు. ఎల్ఎఫ్ రవీందర్, ఆపరేటర్ మల్లేశం, ఫైర్ మన్‌లు నరేష్, కార్తీక్, అరుణ్, శ్రీనివాస్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముడుంబై కార్తీక్‌కు డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న ముడుంబై కార్తీక్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10: కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన ముడుంబై కార్తీక్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు పాండిచ్చేరి యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్శిటీ ప్రతి సంవత్సరం సౌత్‌ఇండియా నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఉత్తమ సేవా సంఘ కార్యకర్తలను 50 మందిని ఎంపిక చేసి వారికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తుంది. ఈ యేడాది తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురిని డాక్టరేట్‌కు ఎంపిక చేయగా అందులో కరీంనగర్‌కు చెందిన ముడుంబై కార్తీక్‌కు శనివారం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తనకు యుఎన్‌ఐపీసీ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు కార్తీక్ తెలిపారు. పలువురు సంఘ, సామాజిక సేవా కార్యకర్తలు, యువకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్ ఆగస్టు 10: నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్వహణలో భాగంగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టూ ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు.. సప్తగిరి కాలనీ, మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, తెలంగాణ చౌక్, కాశ్మీర్‌గడ్డ, ముఖరంపుర, గోదాంగడ్డ, భగత్‌నగర్, సప్తగిరికాలనీ, రామచంద్రాపూర్‌కాలనీ, శ్రీనగర్‌కాలనీ, శివనగర్, ముకరంపుర, విగ్నేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్ ఏరియా, అంబేద్కర్ స్టేడియం,కలెక్టర్ కాంప్లెక్స్ ఏరియా, బస్టాండ్ ఏరియా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్‌ఐసీ ఆఫీస్ ఏరియా, తిర్మలానగర్,గణేష్‌నగర్, హనుమాన్ నగర్, ధోబీవాడ, కమాన్‌ప్రాంతం, టవర్‌సర్కిల్, గంజ్, డీఎఫ్ఓ, డాక్టర్ స్ట్రీట్, కమాన్ ఫీడర్ సబ్‌స్టేషన్ వాటర్‌వర్క్స్ (హౌసింగ్ బోర్డు), సివిల్ హాస్పిటల్ వెనుక వైపు, డాక్టర్ శ్రీదేవి హాస్పిటల్ ఏరియా, డాక్టర్ భూమ్‌రెడ్డి హాస్పిటల్ రోడ్, శ్రీనగర్, వీక్లీ మార్కెట్ ఏరియా, గర్ల్స్ జూనియర్ కాలేజీ రోడ్, సీపీ ఆఫీస్ రోడ్, టవర్ సర్కిల్ తదితర ఏరియాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నిబద్ధ సాహిత్య జీవి నలిమెల

భాస్కర్ కవిత్వం 'సుద్దముక్క' ఆవిష్కరణలో నగునూరి శేఖర్


పుస్తకావిష్కరణ చేస్తున్న సాహిత్యాభిమానులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10: తాను పాటించేదే రాయగల, చెప్పగల నిబద్ధ సాహిత్య జీవి, దేశంలోని 14 భాషలను ఔపోసన పట్టిన గొప్ప సాహితీవేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ అని సీనియర్ పాత్రికేయుడు, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ అన్నారు. శనివారం సాహితీసోపతి ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో 'సుద్దముక్క' ద్వితీయ సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నగునూరి శేఖర్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. భాస్కర్ రాసిన సుద్దముక్క పుస్తకం ద్వితీయ ముద్రణ ప్రతిని ఆవిష్కరించే అవకాశం దక్కడం తన అదృష్టమన్నారు. అనంతరం పుస్తకం తిరిగి పునర్ముద్రణకు నోచుకోవాలని ప్రోత్సహించిన విశ్రాంత జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అన్నాడి గజేందర్‌రెడ్డి పుస్తక పరిచయం చేశారు. కవి నేపథ్య వివరాలను భాస్కర్ బాల్య మిత్రుడు వేముల సత్యనారాయణ వివరించారు. డాక్టర్ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ స్థానిక చరిత్రను, కవుల కవిత్వాన్ని యువ కవులు, రచయితలు అధ్యయనం చేయాలని అన్నారు. ఇటీవల మరణించిన రచయిత, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బండారి అంకయ్యకు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కవి అన్నవరం దేవేందర్ అధ్యక్షతన కార్యక్రమంలో కవులు, రచయితలు,ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రచయితల వేదిక, సాహితీ సోపతి కార్యక్రమాల నిర్వహణకు అక్కెపెల్లి బాల్‌రెడ్డి యాభైవేల రూపాయలను నిర్వాహకులకు అందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

శంకరపట్నం, ఆగస్టు 10: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి అన్నారు. శనివారం మండలంలోని చింతలపల్లి గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌నెట్ ఆధారంగా వ్యక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన నేరాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని దొంగలించడం, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడం చేస్తున్నారన్నారు. ఈ నేరాలు ప్రత్యక్షంగా కాకుండా ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నట్లు తెలిపారు. ప్రజలు బ్యాంకు లావాదేవీలు, వ్యక్తిగత సమాచారం అపరిచితులతో పంచుకోవద్దన్నారు. మొబైల్లో అనవసర లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. సైబర్ నేరగాళ్లు బహుమతులు వచ్చినయని, వివిధ కారణాలు చెప్పి వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించే ప్రయత్నం చేస్తారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను సమాచారం ఎవరికి ఇవ్వకూడదన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

హుజూరాబాద్, ఆగస్టు 10: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, మందిరాలపై అక్కడి మైనార్టీలు దాడులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, అంకిత శ్రీనివాస్, తూర్పాటి రాజు, సుమన్, గంగిశెట్టి ప్రభాకర్, సంజీవరెడ్డి, సారయ్య, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్, వెంకటేష్, సాయి పాల్గొన్నారు.

కిట్స్‌లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 9: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్‌లో శనివారం ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా 9వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ డానియల్ లైటిజమ్ మాట్లాడుతూ ఈ శిక్షణ పది రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణలో ఫైరింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్ బెటిల్, డ్రిల్, తదితర విభాగాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సంగారెడ్డిల నుంచి 500 మంది క్యాడెట్స్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా శివశంకర్ జయంతి



శివశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 10: పట్టణంలోని మోత్కులగూడెం చౌరస్తాలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి పుంజల శివశంకర్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొనగంటి రాము, పొనగంటి సారంగం, నాయకులు పొనగంటి సంపత్, ఏబూషి శ్రీనివాస్, ఆకుల నారాయణ, ఏబూషి సంపత్, ఎడ్ల రాజేందర్, ముకుంద సుధాకర్, రవీందర్, సతీష్ పాల్గొన్నారు.

● గంగాధర: గంగాధరలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మున్నూరు కాపు కన్వీనర్ మడ్లపల్లి శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి పంద్రాగస్టు రోజున స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక 17,18,19 డివిజన్ల పరిధిలోని పశ్చిమజోన్ యువ మోర్చా అధ్యక్షుడు పొన్నాల రాము ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్శిటీ సమీపంలోని జ్యోతిబా పూలే విగ్రహ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికికరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● భగత్‌నగర్: హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత బీజేవైఎంపై ఉందని బీజేవైఎం ప్రభారి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను చాటాలని బీజేపీ నాయకులు బాస సత్యనారాయణ, గుగ్గిళ్లపు రమేష్‌లు అన్నారు.

● హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కొత్తపల్లి మండల ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు.


జ్యోతిబాపూలే విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

అలరించిన డాక్టర్ గంద్ర లక్ష్మణరావు అవధానం


అవధానం నిర్వహిస్తున్న డాక్టర్ గంద్ర లక్ష్మణరావు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10: తెలుగు పద్యకవితా సదస్సు ఆధ్వర్యంలో సుప్రసిద్ధ పండితులు గోవర్ధన రాఘవాచార్యుల స్మృతిలో శనివారం భగత్‌నగర్ అద్విత ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన డాక్టర్ గంద్ర లక్ష్మణరావు అష్టావధానం అలరించింది. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ లక్ష్మణరావు జిల్లా సాహిత్య ఆస్తిలో ఒకరని అన్నారు. ఆ ఆస్తికి మనమంతా వారసులమేనని పేర్కొన్నారు. పండితులు రాఘవాచార్యుల స్మృత్యర్థం ఈ అవధానం జరుగడం విశేషమని ఇందుకు నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. సంస్థ అధ్యక్షుడు రామక విరలశర్మ అధ్యక్షతన జరిగిన ఈ అవధానంలో అతిథులుగా వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య, బహు భాషా వేత్త డాక్టర్ నలిమెల భాస్కర్, సర్వవైదిక సంస్థానం ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాద్, సమన్వయకర్తగా కెఎస్ అనంతాచార్య, పృచ్ఛకులుగా సుదర్శనం వేణుశ్రీ, రాజారాంమోహన్, డాక్టర్ తత్వాది ప్రమోద్‌కుమార్, కాందూరి వేంక టేశ్వర్లు, డాక్టర్ బీవీఎన్ స్వామి, శేషం శ్రీనివాసాచార్యులు, ఆముక్తమాల్యద, గాజుల రవీందర్ సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. అవధాన అనంతరం సంస్థ, గోవర్ధన రాఘవాచార్యుల కుటుంబ సభ్యుల పక్షాన డాక్టర్ గంద్ర లక్ష్మణరావు 'అవధాన ధురీణ' బిరుదును ప్రదానం చేసి సన్మానించారు.

జీయర్ ట్రస్టుకు బస్సు అందజేత

భగత్‌నగర్, ఆగస్టు 10: నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లిలోని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు 31 లక్షల విలువైన బస్సును ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో దక్షిణ మధ్య జోన్ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీ కేవలం బీమా వ్యాపారమే కాకుండా సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొంటుందన్నారు. తమ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన ప్రాంత పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్న జీయర్‌ట్రస్టుకు 42 సీట్లు కలిగిన రూ. 31 లక్షల విలువైన బస్సును అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ (మార్కెటింగ్) ఉతుప్ జోసెఫ్, సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్‌రావు, గురుకుల జెట్ సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ఎల్‌ఐసి మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కె శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రాజేష్‌కన్నా, క్లాస్-1 అధికారుల సంఘం నాయకులు రాజ నరేందర్,ఆర్ సత్యనారాయణ, క్లాస్ టు అధికారుల సంఘం నాయకులు వాసుదేవరెడ్డి, కమలాకర్, ఇన్సురెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామ్మోహన్‌రావు, బసవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో మేనేజ్‌మెంట్ క్లబ్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, ఎస్‌యూ హెచ్‌వోడీ మనోహర్

భగత్‌నగర్, ఆగస్టు 10: అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మేనేజ్‌మెంట్ క్లబ్‌ను కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ మనోహర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ క్లబ్ ద్వారా విద్యార్థులలో చదువుతో పాటు అదనపు నైపుణ్యాలు మెరుగు పరుచుకోవచ్చన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో చాంపియన్ షిప్‌ను మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మనోహర్ మాట్లాడుతూ వ్యాపార, మేనేజ్‌మెంట్ రంగంలో పోటీ తట్టుకునే విధంగా కళాశాల విద్యార్థినిలను తీర్చిదిద్దడం కోసం అల్ఫోర్స్ యాజమాన్యం మేనేజ్ మెంట్ క్లబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీనితో వ్యవస్థాపక నైపుణ్యాలు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్స్, సెమినార్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థినిల నైపుణ్యా సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ, అధ్యాపక బృందం, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ యోగి మరణం బాధాకరం

గణేశ్‌నగర్,ఆగస్టు 10: జర్నలిస్ట్ యోగి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పీవీడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడు ఎండీ షుకూర్ అన్నారు. హన్మకొండలో తన కూతురుతో సహా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన యువ జర్నలిస్ట్ గెట్టుకొప్పుల యుగంధర్‌రెడ్డి (యోగి) కరీంనగర్ జిల్లా ఫొటో అండ్ వీడియో జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. షుకూర్ మాటా డుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న యువ జర్నలిస్టు బలవన్మరణానికి పాల్పడడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వాలు అండగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, కార్యదర్శి జన్నారం శ్రీనివాస్, వీడియో జర్నలిస్ట్ దండు సంపత్, ఆంజనేయులు, నర్సింగ్, రవికుమార్, సుధీర్, ఫొటోగ్రాఫర్స్ కిరణ్, రంజిత్, సదానందరం, రాం ప్రసాద్, శ్రీధర్, సుధాకర్, సంతోష్, రఘు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ చౌక్‌లో నివాళులర్పిస్తున్న ఫొటో, వీడియో జర్నలిస్టులు

స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవాలి

జమ్మికుంట, ఆగస్టు 10: స్వాతంత్ర్య సమర యోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేశారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది త్యాగాలతోనే దేశానికి స్వాతంత్రం లభించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎరబెల్లి సంపత్‌రావు, మాడ గౌతమ్‌రెడ్డి, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, కోరె రవీందర్, పల్లపు రవి, దొంతుల రాజ్‌కుమార్, ఠాగూర్ రాజేష్, గణేష్, మధు, స్వామి, స్వరూప పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాచపల్లిలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలతో అలంకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, మట్ట పవన్‌రెడ్డి, గుత్తికొండ రాంబాబు, మల్లేశం, హరీష్, రాజ్‌కుమార్, అంకుశావలి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం కొత్తగట్టులో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సుధగోని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు, మాడ వెంకటరెడ్డి, ఆలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య మీస అర్జున్, దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, సారయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

'జ్యోతిష్మతి' విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

తిమ్మాపూర్, ఆగస్టు 10: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకున్న పలువురు ప్రభుత్వ, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని సంస్థ చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన గడికొప్పుల రఘు గిరిజన సంక్షేమ శాఖలో, వాసం సాయికుమార్ పంచాయతీ రాజ్ శాఖలో ఏఈఈగా ఉద్యోగాలు సాధించారన్నారు. బ్రాడ్రిడ్జ్‌లో మెయిన్‌ఫ్రేమ్ డెవలపర్‌గా పి అక్షయ, క్యాప్ జెమినిలో అనలిస్టుగా సీహెచ్ వర్ష, రిటైల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎన్ గణేష్‌రెడ్డి, టెక్ మహీంద్రాలో అసోసియేట్ కస్టమర్ సపోర్ట్‌గా బి అంబిక, టెక్ మహీంద్రాలో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సీహెచ్ సంజన మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రెటరీ సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్స్ వైశాలి, అధ్యాపకులు అభినందించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

చొప్పదండి, ఆగస్టు 10: చొప్పదండికి చెందిన ఎన్నం మణిచరణ్ బాసర ట్రిపుల్ ఐటిలో స్పోర్ట్స్ కోటాలో సీటు సాధించాడు. సిరిసిల్ల మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి పాసైన మణిచరణ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు.

నేడు కేంద్ర మంత్రి అన్నారం రాక

మానకొండూర్, ఆగస్టు 10 : మండలంలోని అన్నారంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ఎడిబుల్ టీ కప్స్ తయారీ కేంద్రాన్ని ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పాకాల పురుషోత్తంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ

గంగాధర, ఆగస్టు 10: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేసి పూలమాలవేశారు. అనంతరం మంద క్రిష్ణ మాదిగ, పీఎం నరేంద్ర మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఎన్నో మలుపులు తిరిగిందన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత ఈనెల ఒకటిన సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మల్యాల వినయ్‌సాగర్, చిలుముల రాజయ్య గంగాధర రాజయ్య, లింగయ్య, అఖిల్, అనిల్, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

'సన్మాతన ధర్మాన్ని పరిరక్షించాలి'

రామడుగు, ఆగస్టు 10: సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని మహిళా ధర్మరక్షణ సమితి సభ్యులు అన్నారు. శనివారం ధర్మజాగరణ సమన్వయ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంజాల వెంకటరమాదేవి, కెమిశెట్టి పద్మ, గంట రేఖ, గంట రేవతి, వేముల శారద, పాకాల రాములగౌడ్, గంగాధర్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం


వనమహోత్సవంలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు, ఎక్సైజ్ అధికారులు

వీణవంక, ఆగస్టు 10: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల సమ్మయ్య ఆధ్వర్యంలో వన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు, గౌడ సంఘం నాయకులు వన మహోత్సవంలో పాల్గొని ఈత చెట్లను నాటారు. కార్యక్రమంలో జమ్మికుంట ఎక్సైజ్ సీఐ మాధవిలత, ఎస్ఐ సౌమ్య, కానిస్టేబుల్స్ ఫయాజ్, శైలజ, కృష్ణారెడ్డి, భరత్, గౌడ సంఘం నాయకులు దొమ్మాటి రాజమల్లుగౌడ్, పల్లె స్వామి, బుర్ర రాములు, అగ్గి శ్రీనివాస్, తాల్లపల్లి సమ్మయ్య, రాజు, రాజేందర్, రవి, రాకేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'కొత్త రైల్వేమార్గం మంజూరుపై కేంద్ర మంత్రి అసమర్థత'

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 10 : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక్క కొత్త రైల్వేమార్గం కూడా సాధించలేకపోవటం కేంద్రమంత్రి బండి సంజయ్ అసమర్థత కారణమని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే మార్గంకు కనీసం ప్రతిపాదన చేశారా? మంత్రులను కలిశారా? కేంద్రమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేములవాడ, కొండగట్టు క్షేత్రాలకు వెళ్లేలా కొత్త రైల్వేమార్గం మంజూరు చేయించాలన్నారు.

ఇరుకుల్ల వాగులో వ్యర్థాలు

కరీంనగర్ రూరల్, ఆగష్టు10: కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి కింద వ్యర్థ పదార్థాలతో నింపుతున్నారు. వర్షం కురిసినపుడు వ్యర్థ పదార్థాలు వాగులో కలుస్తున్నాయని దుర్శేడ్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగులో ఉన్న మంచినీటి బావుల్లో వ్యర్థ పదార్థాలు కలిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు తెలిపారు.

సినారే పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, ఆగష్టు 10: హైదరాబాద్‌కు చెందిన మహాకవి సినారె సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏబిఆర్ ఏసి కన్వెన్షనల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బూర్ల వేంకటేశ్వర్లు సినారె పురస్కారాన్ని అందుకున్నారు.

వీధికుక్కదాడిలో బాలుడికి గాయాలు

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, ఆగస్టు 10: నగరంలోని శాతవాహన యూనివర్శిటీ రోడ్డులో ఓ వీధికుక్క బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వీధికుక్క దాడిలో తీవ్రంగా గాయాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తంగళ్ళపల్లి హరినందన్ కుటుంబసభ్యులకు శనివారం హరిహరనగర్ కాలనీకి చెందిన వరాల నర్సింగం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. దుబాయిలో ఉంటున్న ఆయన తన బంధుమిత్రులు, స్థానికులతో రూ.10వేల నగదును బాలుడి తల్లిదండ్రులు తంగళ్ళపల్లి పద్మ, వినోద్‌కు అందజేశారు.

పూజాసామగ్రి అమ్మకాలకు టెండర్లు

కరీంనగర్ కల్చరల్, ఆగష్టు 10: నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి దేవాలయ పరిధిలోని 5 దుకాణాల నిర్వహణకు ఈ నెల 13న మధ్యాహ్నం ఒంటి గంటకు టెండర్ల రూపంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 13వ తేదీ ఉదయం గంటలు 11-30 నిముషాలకు కొబ్బరికాయలు, వాహన సామగ్రి అమ్ముకునే హక్కు కోసం వేలం జరుగుతుందని, ఔత్సాహికులు ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సుదర్శన జయంతి

కరీంనగర్ కల్చరల్, ఆగష్టు 10: లోకకల్యాణార్థం శనివారం సుదర్శన జయంతిని పురస్కరించుకొని యజ్ఞవరాహ క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిపారు. పుణ్యాహవాచనం అనంతరం సుదర్శనస్వామికి అభిషేకం, మూలమంత్ర, సుదర్శన శతక, నారసింహ, వరాహ మూల మంత్రాలతో హవనం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానం ట్రస్టు ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు

కరీంనగర్ రూరల్, ఆగష్టు10: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ లయన్ చింతల కిషన్ పటేల్, యంజెఫ్ జోన్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో వృద్ధులకు శనివారం ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. రేకుర్తి లయన్స్ క్లబ్ చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, ట్రస్టు సభ్యులు కోల అన్నారెడ్డి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్‌లు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్, కన్నాపూర్ గ్రామ మాజి సర్పంచ్ లయన్ వెంటక రమణారెడ్డి పాల్గొన్నారు.

సోషల్‌మీడియాలో విషప్రచారంపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 : యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్‌పై సామాజిక మాధ్యమాల ద్వారా విషప్రచారం చేస్తున్న పేరాల సాయికిరణ్‌రావు, హర్షవర్ధన్ వారికి సహకరిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అట్ల అనిల్‌ముదిరాజ్, ఎండీ నవాజ్, ప్రధానకార్యదర్శులు కిమ్ ఫహద్, కృపాసాగర్ ఒకటో టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు.

కరాటేలో పారడైజ్ విద్యార్థుల విజయకేతనం

భగత్‌నగర్, ఆగస్టు 10: రేకుర్తిలోని పారడైజ్ పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతి చాటి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను సెయింట్‌జార్జ్, పారడైస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అభినందించారు.కరీంనగర్‌లో గౌరు నారాయణరెడ్డి స్మారకార్థం నిర్వహించిన మొదటి నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలల్లో పారడైజ్ పాఠశాల విద్యార్థులు జిఅనన్య, ఎం సమీక్ష, కె వందిత, సిహెచ్ మనస్విని, రుషిదా ఆనమ్, నమీరా,ఎస్‌కె ఆరీఫ్‌లు ఉత్తమ ప్రతిభ చాటి కరాటే కుంగ్‌ఫూ, మార్షల్స్ ఆర్ట్స్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

సుభాష్‌నగర్, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని సింధుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగరాజు అన్నారు. మందకృష్ణ ఎన్నో ఏళ్లుగా చేసిన పోరాటం ఫలించిందన్నారు.

నెమలి అప్పగింత

సుభాష్‌నగర్, ఆగస్టు 10: నగరంలోని మంకమ్మతోట ఆర్యవైశ్య భవన్‌కు వచ్చిన జాతీయపక్షి నెమలిని అధ్యక్షుడు జిల్లా అంజయ్య అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. మేనేజర్ శ్రీపతి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ

రామడుగు, ఆగస్టు 10: మండలంలోని కోరపల్లిలో నూతనంగా నిర్మించిన ఆయలంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో మేకల ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రామడుగు, ఆగస్టు 10: పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ నార్త్ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని దేశరాజుపల్లిలో పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. పోస్టుమాస్టర్ జానంపేట మారుతి పాల్గొన్నారు.

లీకవుతున్న తాగునీటి పైపులు

భగత్‌నగర్, ఆగస్టు10: ఏళ్లు గడుస్తున్నా లీకవుతున్న నల్లా పైపులను అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు అన్నారు. శనివారం నగరంలోని కోతిరాంపూర్ నుంచి కమాన్ వెళ్లే దారిలో లీకవుతున్న పైపులైన్ వద్ద నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, కూన రవీందర్, పి భాస్కర్ ఉన్నారు.